సాక్షి మంచిర్యాల

శనివారం । 5 । ఆగస్టు । 2023



అనుమతి వచ్చేనా..?

బెల్లంపల్లి సీఓఈలో లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్ ప్రారంభించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఎమ్మెల్యే చిన్నయ్య అసెంబ్లీలో ప్రస్తావించడం అనుమతిపై ఆశలు రేకెత్తిస్తోంది. 8లో▸

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి: భీమిని, కన్నెపల్లి, జన్కాపూర్, నాయకంపేట్, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని భీమిని డిస్కం ఏఈ ఎ.బాపు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0 /26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి



నెన్నెలలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

నెన్నెల/భీమిని: ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం ఆయన నెన్నెల, భీమిని మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. గర్భిణులకు అందించే సేవల్లో ఏమాత్రం లోపాలున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో డెంగీ, విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ వైద్యాధికారులు లక్ష్మణ్, అనీష్, కృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటరీ భూముల క్రమబద్ధీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: రిజిష్టర్ కాని, నోటరీ ద్వారా జరిగిన వ్యవసాయ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. సరైన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా, అన్ రిజిస్ట్రేషన్ ద్వారా జరిగిన వ్యవసాయ భూముల క్రయవిక్రయాల లావాదేవీలు క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. ఆస్తి వివరాలతో మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, నోటరైజ్డ్ డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు, ఆస్తిపన్ను రశీదు, విద్యుత్ బిల్లు, నీటిపన్నుల రశీదులు, ఇతర భూ ఆధారిత డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 3 వేల చదరపు గజాలకు గరిష్ఠ పరిమితి విధించినట్లు తెలిపారు.

బోదకాలు నివారణకు మాత్రల పంపిణీ



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: బోదకాలును పూర్తిగా నివారించేందుకు ఈ నెల 10న జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యే మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలకు బోదకాలు నివారణ మాత్రలపై అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోదకాలు నివారణకు ఎండీఏ కార్యక్రమంలో ఐవర్ మెక్టిన్, డీఈసీ, అల్బెండజోల్ మాత్రలను మింగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సిహెచ్. రామ్మూర్తి, వైద్యాధికారులు డాక్టర్ శ్వేత, డాక్టర్ నాగమణి, మెప్మా సిబ్బంది చంద్రయ్య, అపర్ణ, ఏఎన్‌ఎం దివ్య పాల్గొన్నారు.

23న జెడ్పీ సమావేశం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23 ఉదయం 10:30 గంటలకు జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

హౌజింగ్ సొసైటీ సమస్యలు తీర్చండి



వినతిపత్రం అందిస్తున్న సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని హౌజింగ్ సొసైటీ సమస్యలను తీర్చాలని హౌజింగ్ సొసైటీ సభ్యులు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు గడియారం శ్రీహరి మాట్లాడుతూ హౌజింగ్ సొసైటీకి కోర్టు కేసు స్టేటస్‌కో పోయినందున తమకు ఇళ్లు కట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మొహమ్మద్ హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఎస్.మొండయ్య, సయ్యద్, ఇంతియాజ్ అహ్మద్, బేతు కళావతి, ఆండాలు, డి.శాంతయ్య, మదాడి పాండు, సంపత్, రాజమౌళి పాల్గొన్నారు.

నిషేధమేది..!

కలుపు నియంత్రణ కోసం..

పర్యావరణానికి హానితోపాటు భూసారం దెబ్బతింటుందని, మనుషుల ప్రాణాలకు హాని కలుగుతుందని ప్రభుత్వం గ్లైఫోసెట్ మందును నిషేధించింది. జిల్లాలో అధికంగా సాగయ్యే పత్తి పంట కలుపు నివారణ, కూలీల కొరతను అధిగమించడానికి రైతులు గ్లైఫోసెట్ మందు పిచికారీ చేయడంపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో వ్యాపారులు అక్రమంగా దిగుమతి చేసుకుంటూ రైతులకు చేరవేస్తున్నారు. నిషేధిత గ్లైసిల్ పత్తి విత్తనాలు విత్తుకున్న రైతులు పంట కలుపు దశలో ఉండడంతో గ్లైఫోసెట్ కలుపు మందు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తమ వద్ద నిషేధిత విత్తనాలు కొన్న రైతులకు వ్యాపారులు గ్లైఫోసెట్ కలుపు మందు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల గ్లైఫోసెట్ మందు పిచికారీ చేస్తున్నారు.



పత్తిలో కలుపు నివారణ మందు పిచికారీ చేస్తున్న రైతు

- గడ్డిమందు గ్లైఫోసెట్ సరఫరా
- జిల్లాకు చేరిన వేలాది లీటర్లు
- జోరుగా సాగుతున్న విక్రయాలు
- భూసారం, పర్యావరణం, ప్రాణవాయువుకు ముప్పు
- గతేడాది పదుల సంఖ్యలో కేసులు.. ఈ ఏడాది ఒక్కటీ లేదు..

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నిషేధిత గడ్డి మందు గ్లైఫోసెట్‌పై నియంత్రణ కరువైంది. ఫలితంగా వేలాది లీటర్లు జిల్లాకు చేరగా విక్రయం జోరుగా సాగుతోంది. వానాకాలం సీజన్‌లో ప్రభుత్వ ఆదేశాలతో ఈ ఏడాది నిషేధిత, గుర్తింపు లేని పత్తి విత్తనాలు కొంతవరకు పట్టుకుని కేసులు నమోదు చేశారు. కానీ సరఫరాను పూర్తిస్థాయిలో అడ్డుకోలేకపోయారు. ప్రస్తుతం కలుపు మందు సరఫరాను నియంత్రించకపోవడంతో అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కలుపు మందు విక్రయాలు, సరఫరా, వినియోగంపై నిషేధం ఉందా..? లేదా..? అనే సందేహం కలుగుతోంది. గతంలో ఇదే సీజన్‌లో పెద్దయెత్తున తనిఖీలు చేపట్టి వందల లీటర్ల గ్లైఫోసెట్ పట్టుకుని పదుల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది తనిఖీలు లేవు.. పట్టుకున్నదీ లేదు. దీంతో బహిరంగంగానే చెలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట ఎదుగుదల దశకు చేరుకుంది. కలుపు మొక్కలు బాగా పెరిగిపోవడంతో ప్రస్తుతం కలుపు నివారణ పనులు సాగుతున్నాయి. రైతులు కలుపు నివారణ కోసం నిషేధిత గడ్డి మందును ఆశ్రయిస్తున్నారు. దీంతో అక్రమార్కులు గుర్తింపు లేని పత్తి విత్తనాలు చేరవేసినట్లుగానే కలుపు నివారణకు గ్లైఫోసెట్ సరఫరా చేస్తున్నారు.

నేరుగా రైతుల వద్దకే..!

ఈ ఏడాది 1.90లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు 1,64,247 ఎకరాల్లో సాగైంది. ఇందులో సుమారు 50శాతం వరకు నిషేధిత గ్లైసిల్ విత్తనాలే ఉండడం గమనార్హం. గుట్టుచప్పుడు కాకుండా గ్లైఫోసెట్ మందును రైతులకు అందిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి ఉమ్మడి జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మీదుగా జిల్లాలోని తాండూర్, భీమిని, వేమనపల్లి, బెల్లంపల్లి, నెన్నెల, కాసిపేట మండలాలకు, మరోవైపు మహారాష్ట్ర నుంచి సిరొంచ, అర్జునగుట్ట మీదుగా జిల్లాలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాలకు వేలాది లీటర్లు తరలిస్తున్నారు. చోటామోటా నాయకుల హస్తంతోనే పెద్దమొత్తంలో సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రాత్రికి రాత్రే ప్రైవేటు వాహనాల్లో జిల్లాకు తరలించి అటవీ, ప్రాంతం, చేన్ల వద్ద భూమిలో పాతి ఉంచి గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. తెల్లవారే సరికి మారుమూల గ్రామాలు, పత్తిచేన్ల వద్దకు తరలిస్తున్నారు. లీటర్‌కు రూ.600 నుంచి రూ.800 చొప్పున, 5, 10, 20 లీటర్ల క్యాన్లలో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో జూన్ నుంచి ఇప్పటివరకు పోలీసులు, వ్యవసాయ అధికారులు దాడులు చేసిందీ లేదు.. పట్టుకున్నదీ లేదు. దీంతో పెద్దయెత్తున రైతుల చేన్ల వద్దకే నేరుగా చేరుతున్నట్లు తెలుస్తోంది. లిక్విడ్ రూపకంగానే కాకుండా పౌడర్‌గానూ గడ్డిమందును తీసుకొస్తున్నారు. అనుమానం రాకుండా కొత్త పద్ధతుల్లో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. నకిలీ గడ్డి మందు కూడా చేరవేసి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

కలుపు మందు పట్టుబడలేదు..

గడువు తీరిన, నకిలీ, అధిక ధరల నియంత్రణ, విత్తనం, ఎరువులు, పురుగుమందులు నివారించేందుకు, నిల్వలు, రిజిష్టర్ నిర్వహణ కోసం ఫెర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయాధికారులు తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది నిషేధిత విత్తనాల సాగు లేదు. దీంతోపాటు కలుపు నియంత్రణ మందు సైతం వాడకం తగ్గిపోయింది. ఇప్పటివరకు జిల్లాలో ఒక్క చోట కూడా పట్టుబడలేదు. – కల్పన, జిల్లా వ్యవసాయధికారి

ఆర్టీసీలో 'కళ్ల కలక'లం

- ఆస్పత్రిలో చుక్కల మందు కొరత
- ఇబ్బందుల్లో ఉద్యోగులు



మంచిర్యాల ఆర్టీసీ వైద్యశాలలో కళ్ల కలక వచ్చిన ఉద్యోగిని పరిశీలిస్తున్న వైద్యుడు పరంజ్యోతి

మంచిర్యాలఅర్బన్: కళ్ల కలక ఆర్టీసీపై ప్రభావం చూపుతోంది. ఉద్యోగుల్లో కలకలం రేపుతోంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుండడంతో రోజుకు ముగ్గురు నుంచి ఐదుగురు ఈ వ్యాధి బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల ఆర్టీసీ వైద్యశాలలో చుక్కల మందు, వేపకాయల కొరతతో బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కళ్ల కలక వచ్చిన వారు మిగతా వారికి దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నా.. సిబ్బంది కొరత వల్ల తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సి వస్తోంది. జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నా యాజమాన్యం సెలువులు ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. అవిశ్రాంతితో మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

డిపోలో ఇలా..

మంచిర్యాల డిపోలో 231 మంది కండక్టర్లు, 180 మంది డ్రైవర్లు, 75మంది గ్యారేజీ కార్మికులు, 54మంది సూపర్‌వైజర్ స్టాఫ్, సిబ్బంది ఉన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు జనాల మధ్య విధులు నిర్వర్తిస్తుంటారు. కళ్ల కలక వచ్చినా విధులకు వెళ్లాల్సి వస్తుండడంతో ఇతరులకు వ్యాప్తి చెందుతోందని ఉద్యోగులు వాపోతున్నారు. సెలవులు, సిక్‌లీవ్‌లు ఇవ్వాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధి బారిన పడిన కార్మికులకు ఓడీలు ఇవ్వకుండా చిన్న చిన్న రోగాల పేరిట నెలల తరబడి ఓడీలు ఇవ్వడంపై తప్పు పడుతున్నారు.

చుక్కల మందు కొరత

ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆర్టీసీ వైద్యశాలలో చికిత్స పొందుతుంటారు. ఐదు రోజులుగా కంటిచుక్కల మందు కొరత కారణంగా బయట కొనుగోలు చేస్తుండడంతో ఆర్థికంగా భారం పడుతోంది. మంచిర్యాల డిపోలో గుండె సంబంధిత, కండరాల నొప్పి తదితర వ్యాధులతో బాధపడుతున్న 24 మందికి మెరుగైన వైద్యం కోసం ఆర్టీసీ యాజమాన్యం సిఫారసు చేసింది. ఉద్యోగులకు నొప్పుల గోళీలు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల వైద్యశాలకు నెలవారీగా కార్మికులు, కుటుంబ సభ్యులు 1500 మంది పైన వస్తుంటారు. 300 మందికి మాత్రమే సరిపడా మందులు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యవసరమైన మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో బయట దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

జాగ్రత్తలు అవసరం

కళ్ల కలక వచ్చిన వారు కళ్లను చేతులతో తాకరాదు. చేతుల్లోని బ్యాక్టీరియా సమస్యను మరింత పెంచే అవకాశం ఉంది. ఒక కంటికి వాడిన చేతిరుమాలు మరొక కంటికి వాడకూడదు. కళ్ల కలక సాధారణంగా రెండ్రోజుల్లో తగ్గిపోతుంది. కంగారు పడకుండా వైద్యుడి సూచనలు పాటించాలి. అత్యవసరం ఉన్నా రోజుకు ఇద్దరికైనా ఉద్యోగులకు సిక్ లీవులు ఇస్తున్నాం.

– పరంజ్యోతి, ఆర్టీసీ వైద్యశాల వైద్యుడు

పోలీస్ ఉద్యోగాలతో మహిళలకు ఆత్మస్థైర్యం



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: పోలీసు ఉద్యోగాలతో మహిళల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం మంచిర్యాల జిల్లా పోలీసు శాఖలోని హోంగార్డులు, ఎస్సై స్థాయి మహిళా అధికారులకు హైదరాబాద్‌కు చెందిన చిందు ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులతో లీడర్‌షిప్, స్ట్రెస్ మేనేజ్‌మెంటు, లైఫ్ బ్యాలెన్స్, ఓవరాల్ వెల్‌నెస్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా ఉద్యోగుల శాతం పెంచడానికి ప్రభుత్వం 33శాతం రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు. మహిళలు పోలీస్‌శాఖలో చేరేందుకు ముందుకు రావాలని అన్నారు. కుటుంబ బాధ్యతలతోపాటు సమాజ సేవ, విధినిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం చిందు సంస్థ ప్రతినిధులు సబ్రీనా, సురేష్, సారిక, శిరీష వ్యక్తిత్వ వికాసం, ఆత్మస్థైర్యం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, మానసిక సామర్థ్యం పెంపొందించుకోవడం తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీపీపీ కార్మికుల సమస్యలు పరిష్కారం



సంఘ నాయకులతో సమావేశమైన అధికారులు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్టీపీపీ) కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యాయి. బీఎంఎస్ అనుబంధ సంఘం గతంలో ఇచ్చిన సమ్మె నోటీసులో భాగంగా పలుమార్లు డిప్యూటీ సీఎల్‌సీ సమక్షంలో నిర్వహించిన చర్చల్లో సఫలీకృతమైన డిమాండ్లపై శుక్రవారం ఎస్టీపీపీ అధికారులు స్థానిక అతిథి గృహంలో బీఎంఎస్ నాయకులతో సమావేశం అయ్యారు. కార్మిక సంఘం నాయకుల డిమాండ్లపై చర్చించారు. పలు డిమాండ్లను స్థానికంగా పరిష్కరించినట్లు తెలిపారు. అన్‌స్కిల్డ్ ఎంప్లాయిస్‌కు ప్రమోషన్లు, డస్ట్ అలవెన్సులు, ఎంప్లాయి కార్డులు, సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు మూడు జతల బట్టలు, క్యాంటీన్ సౌకర్యం మెరుగుపర్చడం, ప్రతీ నెల సకాలంలో వేతనాలు చెల్లించడం వంటి అంశాలతోపాటు పలు డిమాండ్లను యాజమాన్యం అంగీకరించినట్లుగా నాయకులు పేర్కొన్నారు.

హెచ్‌ఐవీ నివారణలో భాగస్వాములు కావాలి



5కే రన్ ప్రారంభిస్తున్న సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలో హెచ్‌ఐవీ నివారణలో భాగస్వాములు కావాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రెడ్ రిబ్బన్ రన్ 2023 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణలోనే ఉందని, దీనిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు పలు రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. హెచ్‌ఐవీపై యువతకు పూర్తి అవగాహన ఉండాలని, జీవన నైపుణ్యాలను కలిగి ఉంటూ నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డాక్టర్ నీరజ, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి వి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటు

- ఉమ్మడి జిల్లాలో 1484మందికి కేటాయింపు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల(వీఆర్‌ఏ)ను ఆయా శాఖల్లో సూపర్ న్యూమెరరీ పోస్టులు సృష్టించి రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వం వీఆర్‌ఏలను విద్యార్హతల ఆధారంగా సర్దుబాటు చేసేందుకు ప్రక్రియ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో నిరాక్షరాసులు, పది, ఇంటర్, డిగ్రీ, డిగ్రీపైనా చదివిన వారిని అర్హతను బట్టి రెవెన్యూ, మున్సిపల్, సాగునీటి, మిషన్ భగీరథ శాఖల్లో సర్దుబాటు చేశారు. ఇందులో కనీస విద్యార్హత లేని వారిని మిషన్ భగీరథలో హెల్పర్‌గా, డిగ్రీ, ఆపైనా ఉన్నవారిని రెవెన్యూ శాఖలోనే తిరిగి జూనియర్ అసిస్టెంట్ హోదాతో పోస్టులు కేటాయించారు. వీఆర్‌ఏ వ్యవస్థ రద్దయ్యాక ఎలాంటి జాబ్‌చార్టర్ లేకుండా గౌరవ వేతనంతో పని చేసిన ఉమ్మడి జిల్లాలో మొత్తం 1484మంది వీఆర్‌ఏలకు ఆయా శాఖల్లో సర్దుబాటు చేయడంతో లబ్ధి చేకూరింది. కొత్త పోస్టుల హోదా ప్రకారం జీత భత్యాలు అందనున్నాయి.

జిల్లాల వారీగా కేటాయింపు ఇలా..

కేటాయించిన శాఖలు	ఆదిలాబాద్	మంచిర్యాల	నిర్మల్	కుమురంభీం
జూనియర్ అసిస్టెంట్ (రెవెన్యూ)	76	75	73	59
వార్డు ఆఫీసర్(మున్సిపల్)	07	47	28	24
రికార్డు అసిస్టెంట్ (రెవెన్యూ)	61	61	64	52
ఆఫీస్‌సైబ్‌మెన్ (రెవెన్యూ)	11	12	11	10
లస్కర్ (సాగునీటి)	81	83	104	93
హెల్పర్(సాగునీటి)	07	08	24	17
మిషన్ భగీరథ(హెల్పర్)	102	96	108	90
మొత్తం పోస్టులు	345	382	412	345

రాళ్లవాగుకు కరకట్ట నిర్మించాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావన

మంచిర్యాలటౌన్: గోదావరి నది పరీవాహక ప్రాంతం, రాళ్లవాగు ఉధృతితో 2001లో పాతమంచిర్యాల వద్ద రాళ్లవాగుపై నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయిందని, గత మూడేళ్లుగా పట్టణాన్ని వరద ముంచెత్తుతోందని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దాదాపు 3 వేల పైచిలుకు ఇళ్లలోకి నీరు చేరడం వల్ల చాలామంది నష్టపోయారని పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడం, రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించడం, గోదావరి నదిలోకి వాగు నీరు వెళ్లలేని పరిస్థితిలో పరిసర ప్రాంతాల్లోకి వరద చేరిందని, మంచిర్యాల పట్టణంలోని పలు కాలనీలు నీట మునిగాయని తెలిపారు. రాళ్లవాగు వరద నీరు రాకుండా ఉండేందుకు కరకట్టను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, ఇందుకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

బెల్లంపల్లి ఐటీ కంపెనీలు..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఐటీ కంపెనీలను అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. ఇటీవల ఇళ్ల పట్టాల పంపిణీ కోసం బెల్లంపల్లి మున్సిపాలిటీకి వెళ్లానని, అక్కడ ఐటీ కంపెనీలను స్థానికులు కొందరు నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తన దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. కోల్‌బెల్ట్ క్షేత్రం, చిన్నస్థాయి పట్టణమైన బెల్లంపల్లిలో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయడం ఏంటనీ ఎమ్మెల్యే చెప్పిన మాటలను మొదట తాను నమ్మలేదని తెలిపారు. తీరా ఐటీ కంపెనీలకు వెళ్లి పరిశీలించాక ఆశ్చర్యం కలిగిందని అన్నారు. చిన్నయ్య చెప్పింది వాస్తవమేనని ఆ తర్వాత గ్రహించానని తెలిపారు. ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ ఐటీ కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

సీఓఈలో లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వాలి

బెల్లంపల్లిలోని సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాలలో జాతీయ స్థాయి పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి లాంగ్‌టర్మ్ కోచింగ్ సెంటర్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు మెడికల్, ఇంజినీరింగ్, ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సీట్లు సాధిస్తున్నారని వివరించారు. కోచింగ్ సెంటర్ మంజూరు చేస్తే పేద విద్యార్థులకు మరింత ఉపయోగపడుతుందని తెలిపారు.

మద్యం దుకాణాలకు టెండర్లు

- జిల్లాలో 73 మద్యం దుకాణాలు
- ఎస్సీలకు 10, గౌడ్స్‌కు 6, ఎస్టీలకు 6 కేటాయింపు
- లాటరీ పద్ధతిలో కేటాయింపు
- దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలక్రైం/మంచిర్యాలఅగ్రికల్చర్: 2023–25 సంవత్సరానికి గాను మద్యం దుకాణాల నిర్వహణకు ఎక్సైజ్ శాఖ శుక్రవారం నుంచి టెండర్లు స్వీకరిస్తోంది. నూతన మద్యం పాలసీకి సంబంధించిన రిజర్వేషన్లు, జిల్లాలోని 73మద్యం దుకాణాల గెజిట్ నోటిఫికేషన్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బి.సంతోష్ విడుదల చేశారు. ఈ నెల 18న సాయంత్రం ఆరు గంటల వరకు జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇందుకోసం జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కేజీ.నందగోపాల్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయించారు. హైదరాబాద్ నాంపల్లిలోని కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలోనూ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎంపిక చేసుకున్న దుకాణానికి దరఖాస్తు కోసం ధరావత్తు(ఈఎండీ) రూ.2లక్షలు చలాన్ లేదా డీడీ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులకు ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు వచ్చినా అర్హులే. లైసెన్స్ రుసుం ఆరు వాయిదా పద్ధతుల్లో చెల్లించాలి. గౌడ్, ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయింపు ఖరారు చేస్తారు. ఎంపికైన లబ్ధిదారులు డిసెంబర్ ఒకటి నుంచి దుకాణాలు ప్రారంభించవచ్చని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి తెలిపారు.

జిల్లాలో రిజర్వు చేసిన దుకాణాల వివరాలు

రిజర్వేషన్	దుకాణాలు	నంబర్లు
ఎస్సీ	10	9, 21, 27, 32, 33, 39, 44, 52, 54, 65
ఎస్టీ	6	68, 69, 70, 71, 72, 73
గౌడ్స్	6	6, 8, 18, 55, 57, 63
జనరల్	51	



కొనసాగుతున్న నీటి విడుదల



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను శుక్రవారం 18.426 టీఎంసీల సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో 24 వేల క్యూసెక్కులు ఉండగా, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 294 క్యూసెక్కులు, ప్రాజెక్ట్ 3 గేట్లను ఎత్తి 16 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

క్లుప్తంగా

గ్రామపంచాయతీల సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

చెన్నూర్‌రూరల్‌: జూనియర్‌ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్‌ రెగ్యులరైజేషన్‌ నిమిత్తం మండలంలోని నారాయణపూర్‌, చెల్లాయిపేట, సోమనపల్లి గ్రామ పంచాయతీలను శుక్రవారం అడిషనల్‌ కలెక్టర్‌ బి.రాహుల్‌, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌, జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ ఆశీష్‌ సింగ్‌లు తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఆయా గ్రామ పంచాయతీలలో వైకుంఠధామం, కంపోస్ట్‌షెడ్‌, పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం, నర్సరీ, ప్లాంటేషన్‌ అలాగే రికార్డులను, శానిటేషన్‌, క్లోరినేషన్‌ పనులను పరిశీలించారు. వారి వెంట ఆయా గ్రామాల సర్పంచులు కొత్తపల్లి అమృత, బీమిని శారద, డెబ్బ రవీందర్‌, ఎంపీడీవో టి.శ్రీనివాస్‌, ఎంపీవో అజ్మత్‌ అలీ, ఈజీఎస్‌ ఏపీవో గంగాభవాని ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి



శశి(ఫైల్‌)

దండేపల్లి: కులాన్ని అడ్డుపెట్టుకుని కొందరు వ్యక్తులు, ఓ యువకుడిని వేధింపులకు గురిచేయడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దండేపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్‌ వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లపేటకు చెందిన సందెల శశి(23) ఓ గొడవ కారణంగా గ్రామానికి చెందిన రడపాక బాపు, పోతలింగు, ముల్కల్ల సురేష్‌, సుద్దాల సాలవ్వ, అరుణ్‌ అనే వ్యక్తులు కులాన్ని అడ్డుపెట్టుకుని శశిని హింసించడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డబ్బులు చెల్లిస్తేనే కేసు కాంప్రమైజ్‌ అవుతామని బెదిరించారు. దీంతో మనస్తాపానికి గురైన శశి గత నెల 30న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌ నిమ్స్‌కు రెఫర్‌ చేశారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్‌)

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీకి చెందిన జంజిరాల తిరుపతి (40) శుక్రవారం ఉదయం ఇంట్లోని స్లాబ్‌కు చీరెతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజేశ్వర్‌ తెలిపిన వివరాలు... ట్రైలర్‌ వృత్తితో జీవనం కొనసాగిస్తున్న తిరుపతి గత ఆరు మాసాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సుజాత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతి వచ్చేనా..?



సీవోఈ కళాశాల భవనం

బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల పేరు శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చింది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులకు తగిన రీతిలో శిక్షణ ఇప్పించడానికి సీవోఈలో లాంగ్‌ టర్మ్‌ కోచింగ్‌ను ప్రారంభించడానికి అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రభుత్వాన్ని కోరడం ప్రాధాన్యతను సంతరించుకుంది. లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌కు అనుమతి ఇవ్వడంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని ఎందరో పేద విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గడానికి దోహదం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- బెల్లంపల్లి సీవోఈలో లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌కు ఎదురుచూపులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీ (సీఓఈ) జూనియర్‌ కళాశాలలో లాంగ్‌ టర్మ్‌ కోచింగ్‌ సెంటర్‌ను ప్రారంభించాలనే డిమాండ్‌ ప్రధానంగా వినబడుతోంది. ప్రైవేట్‌, కార్పొరేట్‌ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా సీఓఈలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోంది. ఓ వైపు ఇంటర్మీడియట్‌ విద్యాబోధన చేస్తూనే మరో వైపు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేకంగా లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌ లేకపోయినా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు పోటీపడి చదివి ఉత్తీర్ణత సాధిస్తూ సీవోఈకి వన్నె తెస్తున్నారు. ఉత్తమ ర్యాంకులతో బెల్లంపల్లి సీవోఈ పేరును ఉత్తర తెలంగాణలో మారుమ్రోగిస్తున్నారు. విద్యా సౌరభాలను వెదజల్లుతున్న సీఓఈ కళాశాలలో లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌కు అవకాశం కల్పిస్తే పేద విద్యార్థుల దశ దిశ మారేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పాఠశాల నుండి సీఓఈకి ఎదిగి....

2014 జులై 11న బెల్లంపల్లి కేంద్రంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మంజూరైంది. అదే ఏటా రైల్వే రడగంబాల బస్తీలో ఓ అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య విద్యార్థులకు బోధన ప్రారంభించారు. ఎస్సీ సబ్‌ ప్లాన్‌ నిధులతో గురిజాలకు వెళ్లే మార్గంలో ఆధునిక హంగులతో పక్కా భవనాన్ని నిర్మాణం చేసి 2016 జూన్‌ 6న కొత్త భవనంలోకి మారారు. పదో తరగతి వరకే పరిమితమైన గురుకుల విద్యాలయం 2018లో జూనియర్‌ కళాశాలగా అప్‌గ్రేడ్‌ అయింది. అదే సంవత్సరం సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జూనియర్‌ కళాశాలను సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీగా ప్రకటించింది. 2018–20లో సీవోఈ నుంచి ఇంటర్మీడియట్‌ మొదటి బ్యాచ్‌ విద్యార్థులు 63మంది చదువును పూర్తి చేసి బయటకు వెళ్లగా 2019–21లో 65 మంది, 2020–22లో 73 మంది విద్యార్థులు విజయవంతంగా చదువు పూర్తి చేశారు. 2021–23లో నాల్గో బ్యాచ్‌ విద్యార్థులు 63 మంది పరీక్ష రాసి పాసయ్యారు. బెల్లంపల్లి సీవోఈ విద్యార్థులు ఏటా ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తుండగా, వీరిలో సగటున 80 శాతం మంది విద్యార్థులు మాత్రమే సీవోఈ లక్ష్యాలను అందుకుంటున్నారు.

లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌ హైదరాబాద్‌కే పరిమితం...

సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మెరుగైన విద్యాబోధన కోసం సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీలను ఏర్పాటు చేసింది. ప్రతి ఉమ్మడి జిల్లాలో బాలబాలికల కోసం వేర్వేరుగా సీఓఈ కళాశాలలను ప్రారంభించగా, వీరికి లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌ మాత్రం కేవలం హైదరాబాద్‌ పరిసర ప్రాంతాల సీఓఈల్లో ఇస్తున్నారు. అనేక మంది లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌కు హైదరాబాద్‌ వెళ్లలేక ఉన్నత లక్ష్యాలను సాధించడంలో వెనుకకు నెట్టేయబడుతున్నారు.

ఉత్తర తెలంగాణలో టాప్‌ బెల్లంపల్లి



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు (ఫైల్‌)

ఉత్తర తెలంగాణలో ఉన్న సంక్షేమ గురుకుల సీఓఈల్లో బెల్లంపల్లి సీఓఈ ఉన్నతంగా రాణిస్తోంది. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్‌ నాలుగు బ్యాచ్‌లు బయటకు వెళ్లి నీట్‌ పోటీ పరీక్షరాసి 14 మంది విద్యార్థులు మెడిసిన్‌లో సీటు దక్కించుకోగా, జేఈఈ ప్రవేశ పరీక్ష ద్వారా ఐఐటీ, ఎన్‌ఐటీ, త్రిపుల్‌ ఐటీ, జీఎఫ్‌టీఐ వంటి ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థల్లో మరో 14మంది విద్యార్థులు సీటు సాధించారు. ఐకార్‌, ఐజర్‌, ఢిల్లీ యూనివర్సిటీ, సెంట్రల్‌ యూనివర్సిటీల్లో 18మంది విద్యార్థులు సీటు కైవసం చేసుకుని సత్తా చాటారు. ఇండియన్‌ నేవీ, ఇండియన్‌ ఇన్స్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సైన్స్‌ స్పేస్‌ టెక్నాలజీ వంటి వంటి పలు జాతీయస్థాయి విద్యాలయాల్లో మరో 32మంది సీటు దక్కించుకోవడం విశేషం. వీటితో పాటు ఎంసెట్‌ ద్వారా జేఎన్‌టీయూ (హెచ్‌)లో 15మంది, మిగతా పలు ఇంజినీరింగ్‌ కళాశాలల్లో 38మంది విద్యార్థులు ఇంజినీరింగ్‌ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ఇంటిగ్రేటెడ్‌ ఎమ్మెస్సీ కోర్సుల్లో 12మంది విద్యార్థులు ఉస్మానియా, కాకతీయ, కలింగ, అజిమ్‌ ప్రేమ్‌జీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీటు సాధించి బెల్లంపల్లి సీవోఈ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు.

ఆకర్శిస్తున్న బెల్లంపల్లి సీవోఈ..

ఉత్తమ ఫలితాలతో బెల్లంపల్లి సీవోఈ విద్యార్థుల మదిని దోచుకుంటోంది. ఇక్కడి సీవోఈలో చదవడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌, కరీంనగర్‌, నిజామాబాద్‌, ఖమ్మం, వరంగల్‌ జిల్లాల విద్యార్థులు సీఓఈ ప్రవేశపరీక్ష రాసి సీటు దక్కించుకుని ప్రథమ ప్రాధాన్యత బెల్లంపల్లి సీవోఈకి ఇచ్చి ప్రవేశం పొందుతున్నారు. అలాంటి బెల్లంపల్లి సీవోఈలో లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌ను ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

బెల్లంపల్లికి అవకాశం కల్పించాలి



విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడంలో బెల్లంపల్లి సీఓఈ ప్రత్యేకతను చాటుకుంటోంది. జాతీయస్థాయి పోటీ పరీక్షల కోసం లాంగ్‌ టర్మ్‌ కోచింగ్‌ సౌకర్యాన్ని కల్పించినట్‌లెతై మరింత రెట్టింపు స్థాయిలో ఫలితాలు వచ్చేందుకు అవకాశాలు మెరుగుపడతాయి. ఎందరో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని బెల్లంపల్లి సీఓఈలో లాంగ్‌ టర్మ్‌ కోచింగ్‌కు అనుమతి ఇవ్వాలి.

– దుగుట శ్రీనివాస్‌, పేరెంట్‌, బెల్లంపల్లి

ఫ్లఫ్ఫిని వెతికిస్తే పది వేలు..!



తప్పిపోయిన పిల్లి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఫ్లఫ్ఫి.. నాలుగు నెలల క్రితం కనిపించకుండా పోయింది. దీంతో ఇష్టంగా పెంచుకున్న కుటుంబం తల్లడిల్లిపోయింది. ఆచూకీ కోసం పోస్టర్లు వేసి మరీ గాలిస్తోంది. ఫ్లఫ్ఫి అంటే పర్షియన్‌ జాతికి చెందిన పిల్లి.. మంచిర్యాల పట్టణం బైపాస్‌రోడ్డుకు చెందిన మహ్మద్‌ హాజీ కుటుంబం నాలుగేళ్ల క్రితం 40రోజుల ఆ పిల్లి కూనను రూ.5వేలు వెచ్చించి ఇంటికి తెచ్చుకుని పెంచుకుంటున్నారు. గత ఏప్రిల్‌ 5న రాత్రి 11 గంటల సమయంలో బైపాస్‌ రోడ్డు సమీపంలో తప్పిపోయింది. దీంతో ఆ కుటుంబీకులు తమ పిల్లి ఆచూకీ తెలిపిన వారికి రూ.10వేలు బహుమతి ఇస్తామని ప్రకటించారు. అప్పటి నుంచి సోషల్‌ మీడియాలోనూ, పట్టణంలోని పలు చోట్ల పోస్టర్లు వేసి గాలిస్తున్నారు. కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

త్రోబాల్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శిగా బలరాం



నియామక పత్రాన్ని అందిస్తున్న రవికుమార్‌

బెల్లంపల్లి: త్రోబాల్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శిగా బెల్లంపల్లికి చెందిన యాదండ్ల బలరాం నియామకమయ్యారు. శుక్రవారం బెల్లంపల్లి టేకుల బస్తీలోని కేపీఆర్‌ కన్వెన్షన్‌ హాల్‌లో త్రోబాల్‌ అసోసియేషన్‌ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ త్రోబాల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, సీబీసీఐడీ రిటైర్డు అడిషనల్‌ ఎస్పీ పి.రవికుమార్‌ పాల్గొని బలరాంకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో త్రోబాల్‌ అసోసియేషన్‌ సభ్యులు పరిమళ పాల్గొన్నారు.

బీట్‌ ఆఫీసర్‌ భర్త దౌర్జన్యం...

- ఉన్నతాధికారులు స్పందించాలని బీట్‌ గ్రామాల ప్రజల వినతి

కోటపల్లి: మండలంలోని వెంచపల్లి బీట్‌ అధికారి లత భర్త రాజేశ్‌ దౌర్జన్యం రోజురోజుకూ పెరిగిపోతోంది. బోప్పారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌ సహాయంతో కోటపల్లి ఫారెస్టు నర్సరీ నుంచి బోప్పారం ప్లాంటేషన్‌ను మొక్కలు తరలించేందుకు రూ.4వేలతో రెండు రోజుల క్రితం ఫారెస్టు బీట్‌ అధికారి, ట్రాక్టర్‌ యజమాని మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాడు. సదరు ట్రాక్టర్‌ యజమాని తన వ్యక్తిగత పనుల నిమిత్తం పనికి రాలేకపోవడంతో ఆగ్రహించిన బీట్‌ అధికారి భర్త రాజేశ్‌ ట్రాక్టర్‌ యజమాని ఇంటికి వెళ్లి ఇష్టానుసారంగా తిడుతూ నీ దిక్కు ఉన్న దగ్గర చెప్పుకో అంటూ జులుం ప్రదర్శించి ట్రాక్టర్‌ను ధ్వంసం చేసినట్లు సదరు ట్రాక్టర్‌ యజమాని వాపోతున్నాడు. ఇలా ఫారెస్టు బీట్‌ అధికారి భర్త రాజేశ్‌పై గతంలో కూడా బోప్పారం గ్రామంలో పోడు భూముల సర్వేలో వసూళ్లకు పాల్పడినట్లు పలు ఆరోపణలు ఉన్నప్పటికీ కోటపల్లి ఫారెస్టు అధికారులే తనకు వత్తాసు పలుకుతున్నారని వెంచపల్లి బీట్‌ పరిధిలోని గ్రామాల ప్రజలు తెలిపారు. పోడు భూముల సర్వేలో అన్నీ తానై పెద్ద అధికా రుల అండదండలతో స్థానిక ప్రజలను భయాభ్రాంతులకు గురిచేస్తూ బోప్పారం గ్రామానికి చెందిన పలువురు మహిళలపై, చిన్నారులపై చేయి చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో బోప్పారం, కొండంపేట, నాగంపేట, వెంచపల్లి బీట్‌ పరిధిలో పోడు భూముల సర్వేలో బీట్‌ ఆఫీసర్‌ భర్త లక్షల రుపాయాలు చేతులు మార్చినట్లు ఆరోపణలు ఉ న్నాయి. అతడిపై రేంజర్‌ రవి దృష్టికి తీసుకువెళ్లగా కొట్టిపారేయగా ప్రస్తుతం ట్రాక్టర్‌ను ధ్వంసం చేసిన ఘటనపై వివరణ కోరగా తనకు ఏమి సంబంధం లేదని, తర్వాత మాట్లాడుతానని తెలి పాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని బీట్‌ ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

కారుణ్య నియామక పత్రం అందజేత



కారుణ్య నియామక పత్రం అందిస్తున్న జీఎం

నస్పూర్‌: శ్రీరాంపూర్‌ ఏరియాలోని ఎస్‌ఆర్‌పీ 3, 3ఏ గనిలో సుమారు రెండు సంవత్సరాల క్రితం జరిగిన గని ప్రమాదంలో మృతి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డికి జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి కారుణ్య నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గని ప్రమాదాలలో తోటి కార్మికులు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. గని ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎస్‌ఓటు జీఎం రఘుకుమార్‌, ఇన్‌చార్జి ఇంజినీర్‌ చంద్రశేఖర్‌ రెడ్డి, డీజీఎం పర్సనల్‌ అరవిందరావు, అధికారులు చిరంజీవులు, గోపాల్‌ సింగ్‌, ఏవీరెడ్డి, వెంకటేశ్వర్‌ రెడ్డి, మురళీమోహన్‌, కాంతారావు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌టౌన్‌: ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు కాజీపేట – బల్లార్ష రైల్వేస్టేషన్ల మధ్య నడిచే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు కాగజ్‌నగర్‌ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మూడో రైల్వే పనుల నేపథ్యంలో వారం రోజుల పాటు పలు రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కాజీపేట నుంచి కాగజ్‌నగర్‌, భద్రాచలం నుంచి కాగజ్‌నగర్‌, కాగజ్‌నగర్‌ నుంచి భద్రాచలం, కాగజ్‌నగర్‌ నుంచి కరీంనగర్‌, కరీంనగర్‌ నుంచి కాగజ్‌నగర్‌ ప్యాసింజర్‌ రైళ్లు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

సంస్థ లక్ష్యాన్ని సాధించాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం రవిప్రసాద్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియాను 10 మిలియన్ల టన్నుల ఉత్పత్తిని సాధించే స్థాయికి తీసుకురావాలన్నది సంస్థ లక్ష్యమని ఏరియా జనరల్‌ మేనేజర్‌ రవి ప్రసాద్‌ అన్నారు. శుక్రవారం గోలేటిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఏరియాకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు యాజమాన్యం కృషి చేస్తోందన్నారు. వట్టివాగు డైవర్షన్‌ పనులు కొనసాగుతుండడంతో ఈ సంవత్సరం చివరికల్లా గోలేటి ఓసీపీ ద్వారా ఉత్పత్తి చేపట్టే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఓసీపీ ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణ పనులతో పాటు అన్ని రకాల అనుమతుల ప్రక్రియ శరవేగంగా సాగుతున్నాయన్నారు. కుమురంభీం, మంచిర్యాల జిల్లాల పరిధిలో గోలేటి ఓసీపీ ఏర్పాటు కాబోతున్నందున్న రెండు జిల్లాల కలెక్టర్ల ఆదేశాలకు అనుగుణంగా భూసేకరణ చేపడుతామన్నారు. అటవీశాఖ అనుమతులు కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సి ఉన్నందున అవి వచ్చే లోపూ ఏరియా స్థాయిలో చేపట్టాల్సిన అన్ని పనులు పూర్తి చేస్తామన్నారు. కొత్త గనుల ఏర్పాటు ద్వారా ఉత్పత్తి పెరిగి ఏరియాకు పూర్వ వైభవం సంతరించుకుంటుందన్నారు. ఇక గత నెలలో ఏరియాలో సాధించిన ఉత్పత్తి విషయానికి వస్తే గత నెలలో ఏరియాకు 2లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 2.01 లక్షల టన్నులతో 101 శాతం ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. అధిక వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని లేని పక్ష్యంలో ఉత్పత్తి మరింత పెరిగేదన్నారు. ఈ సమావేశంలో ఎస్‌వోటూజీఎం నరేందర్‌, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్‌, పర్సనల్‌ మేనేజర్‌ లక్ష్మణరావు పాల్గొన్నారు.

హామీల అమలుపై అసెంబ్లీలో చర్చించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

నస్పూర్‌: సీఎం కేసీఆర్‌ గతంలో సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలపై ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్‌ చేశారు. నాయకులు శుక్రవారం శ్రీరాంపూర్‌ ఏరియాలోని ఆర్కే 5 గనిపై గేటు మీటింగ్‌ నిర్వహించారు. అనంతరం నస్పూర్‌ శ్రీరాంపూర్‌ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ గత సింగరేణి గుర్తింపు ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్‌, టీబీజీకేఎస్‌ నాయకులు ఇచ్చిన హామీలపై చర్చించి వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులకు ఆదాయపు పన్ను మాఫీ, సొంతింటి నిర్మాణం కోసం ప్రతీ కార్మికునికి రెండు గుంటల భూమి కేటాయించాలని తెలిపారు. కార్మికుల మారు పేర్లను సరి చేయడం, డిపెండెంట్‌ల అర్హత వయస్సు 40 ఏళ్లకు పెంచాలన్నారు. కార్మిక కుటుంబాలకు శుద్ధతాగు జలాన్ని అందించాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తాము అన్ని ప్రతిపక్ష నాయకులను కలిసి తమ సమస్యలు వారికి వివరిస్తామన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజర్‌ శ్రీనివాస్‌, డివిజన్‌ గౌరవ అధ్యక్షులు మిడివెల్లి శంకర్‌, అధ్యక్షులు గుల్ల బాలాజీ, కార్యదర్శి బాగ్యరాజ్‌, నాయకులు సాయిల శ్రీనివాస్‌, సదానందం, బానేష్‌, శ్రీనివాస్‌, సంపత్‌, నరేశ్‌ పాల్గొన్నారు.

డబ్బులు తీసుకొని పనిచేయడం లేదు

- తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట బాధితుల ఆవేదన



తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట బాధిత మహిళలు

బెజ్జూర్‌: డబ్బులు తీసుకొని కూడా పనిచేయడం లేదని బెజ్జూర్‌ మండలం సలుగుపెల్లి గ్రామానికి చెందిన గోవా అమృత, ఆత్రం స్వాతి అనే గిరిజన మహిళలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకే ఇంటికి చెందిన వీరికి సలుగుపెల్లి (ఉత్సరంగాపల్లి) రెవెన్యూ శివారులో భూములు ఉండగా అవి విరాసత్‌ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే పని చేస్తామని తెలుపడంతో తహసీల్దార్‌ శ్రీపాల్‌రెడ్డి కారు డ్రైవర్‌కు ఆ డబ్బులు ఇచ్చారు. అయినప్పటికీ పని చేయకపోవడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్‌ శ్రీపాల్‌రెడ్డిని వివరణ కోరగా వారికి సంబంధించిన ఫైల్‌ ఉన్నతాధికారులకు ఎప్పుడో పంపించామని, నా డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వమని నేను చెప్పలేదని, నాకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలనే చేస్తున్నట్లుగా ఉందని తెలిపారు.

దాడిచేసిన వ్యక్తికి ఏడాది జైలు

జన్నారం: కుదువపెట్టిన బంగారం విషయంలో దాడి చేసిన ఒకరికి ఏడాది జైలుశిక్ష, మరో వ్యక్తికి రూ.2వేల జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జీ, జ్యుడిషియల్‌ మెజిస్ట్రేట్‌ మహమ్మద్‌ అసదుల్లా షరీఫ్‌ తీర్పునిచ్చినట్లు ఎస్సై సతీశ్‌ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వొజ్జల లక్ష్మి, రాజన్నల కుమారుడు దామోదర్‌ అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు బతికున్న సమయంలో అతడి భార్య వొజ్జల సింధూజ బంగారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ ఫైనాన్స్‌లో కుదువపెట్టారు. బంగారం విడిపించడానికి డబ్బులు కావాలని 2018 ఆగస్టు 11న సింధూజ, ఆమె తండ్రి దండేపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి లక్ష్మీనారాయణ, బొలిశెట్టి శివకుమార్‌, గ్రామ పెద్ద మనిషి ముత్యాల శంకరయ్యలు వొజ్జల లక్ష్మి ఇంటికి వచ్చి లక్ష రూపాయలు ఇవ్వాలని దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు లక్ష్మి అదేరోజు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో 11మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. దీంతో శివకుమార్‌కు ఏడాది జైలు శిక్ష ఖరారైంది.

పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు

జైపూర్‌: పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.7వేలు జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ప్రభాకరారావు శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం... మండలంలోని రామరావ్‌పేటకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌ కామేర రఘువరణ్‌ కిడ్నాప్‌ చేసి అత్యాచారం చేశాడని బాధితురాలి కుటుంబ సభ్యులు 2021 ఫిబ్రవరి 9న జైపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రఘువరణ్‌పై పోక్సో కేసు నమోదు చేసి అప్పటి సీఐ బిల్ల కోటేశ్వర్‌ రిమాండ్‌కు తరలించి తగిన ఆధారాలతో చార్జిషీట్‌ దాఖలు చేశాడు. ఈ కేసులో అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ సురేందర్‌ ఉపాధ్యాయ 16మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేశాడు. దీంతో పోక్సో కోర్టు ఇన్‌చార్జి కె. ప్రభాకరారావ్‌ 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కట్టుకున్నోడే కాలయముడు



మాట్లాడుతున్న సీఐ నరేందర్‌, ఎస్సై భూమేశ్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): మూడు ముళ్లు వేసి ఏడు అడుగులు వేసిన భర్త జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్త అనుమానంతో ఆమె పాలిట కాల యముడయ్యాడు. భార్య వేరే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతుందనే అనుమానంతో వాగులో ముంచి దారుణంగా హత్య చేసాడో. ఈ నెల 2వ తేదీన ఎడవెల్లి వాగులో మహిళా అనుమానాస్పద స్థితి మృతిపై కేసు నమోదు కాగా పోలీసుల దర్యాప్తులో భర్తే వాగులో ముంచి హత్య చేసినట్లు తేలింది. దీంతో శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి సీఐ అల్లం నరేందర్‌ వివరాలు వెల్లడించారు. రెబ్బెన మండలంలోని రాథోడ్‌ గాయత్రి, రాథోడ్‌ సంపత్‌ భార్యాభర్తలు. కూలీ పనులు చేసుకుంటూ ఎడవెల్లిలో నివాసం ఉంటున్నారు. సంపత్‌కు కొంతకాలంగా భార్య వేరే వ్యక్తితో మొబైల్‌ ఫోన్‌లో మాట్లాడుతుందనే అనుమానం ఉంది. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య తరుచు గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గత 2వ తేదీన భార్యభర్తలిద్దరూ ఎడవెల్లిలోని వాగులో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. అక్కడ వేరే వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతున్నావనే విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. దీంతో గాయత్రి మేడను విరిచి నీటిలో ముంచి హత్య చేశాడు. ఈ మేరకు నిందుతుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్సై భూమేష్‌, పోలీస్‌ సిబ్బంది శ్రావణ్‌ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి తీవ్రగాయాలు

బెల్లంపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ సింగరేణి కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. బెల్లంపల్లి టూటౌన్‌ ఎస్సై రవికుమార్‌ కథనం ప్రకారం... బెల్లంపల్లి మున్సిపాలిటీ కన్నాల బస్తీకి చెందిన వనపర్తి చిరంజీవి అనే కార్మికుడు మందమర్రి ఏరియా ఆర్కే –5 గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మొదటి షిఫ్టులో విధులకు వెళ్లి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో బెల్లంపల్లి నుండి మంచిర్యాల వైపునకు వెళ్తున్న ఓ ప్రైవేట్‌ కళాశాల బస్సు కాల్‌టెక్స్‌ రైల్వే ఫ్లెఓవర్‌ బ్రిడ్జిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో చిరంజీవి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పంపించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వృద్ధురాలు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: స్థానిక ఎన్టీఆర్‌ నగర్‌కు చెందిన అరిమడ్ల మల్లమ్మ(83) మతిస్థిమితం లేక ఇంటి వరండలోని కిటికికీ చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై జగదీష్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... అంజమ్మ భర్త, కొడుకు గతంలోనే చనిపోయారు. అప్పటి నుంచి అంజమ్మ మనుమడు అంజన్న వద్ద ఉంటుంది. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

మంచిర్యాలక్రైం: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై రాజేందర్‌ వివరాల ప్రకారం... ఇర్ఫాన్‌ అలీ(19) రైళ్లలో సమోసాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఐదు నెలల క్రితం షమీణ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహం అనంతరం సప్తగిరి కాలనీలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొంత కాలం తర్వాత సమోసాలు విక్రయించడం మానేసి మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరుచుగా భార్యతో గొడువలు మొదలయ్యాయి. శుక్రవారం మద్యం సేవించి మరికొంత మద్యాన్ని ఇంటికి తెచ్చుకున్నాడు. భార్య బయటకు వెళ్లగా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.